సాక్షి
అనకాపల్లి
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024

మహనీయుడు అంబేడ్కర్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. 8లో



పెల్లుబికిన ప్రజాగ్రహం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన హత్యాయత్నం ఘటనపై అనకాపల్లి జిల్లాలో ఆగ్రహ జ్వాలలు రగిలాయి. ఆదివారం పలు ప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వివిధ రూపాల్లో నిరసనలకు దిగారు. జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండిస్తూ అనేక చోట్ల రాస్తారోకోలు, మానవహారాలు, ధర్నాలు నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లోని దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో సర్వమత ప్రార్థనలు చేసి సీఎం జగన్ గాయం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈ కుట్రలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినదించారు.

- సీఎం జగన్‌పై దాడికి ముక్తకంఠంతో ఖండన
- ఊరూవాడా నిరసనలు, ఆందోళనలు
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



మునగపాకలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల మానవహారం

మునగపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం అమానుషమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ ప్రజల్లో సీఎంకు లభిస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు అండ్ కో కుతంత్రాలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం ప్రసాద్ ఆధ్వర్యంలో మునగపాకలో రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు దక్కడం ద్వారా మెరుగైన పాలన అందుతుందన్నారు.

ఆయన బస్సుయాత్రకు వస్తున్న ప్రజా స్పందన చూసి తట్టుకోలేక కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు, కర్రి పెదబ్బాయి, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, మద్దాల వీరునాయుడు, కాండ్రేగుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను భౌతికంగా అంతమొందించే కుట్ర

నక్కపల్లి/ పాయకరావుపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొలేక భౌతిక దాడులకు పాల్పడుతున్నారని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఆరోపించారు. ఆదివారం నక్కపల్లి, పాయకరావుపేటలలో ఆయన స్థానిక నాయకులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. పాయకరావుపేటలో పార్టీ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేష్‌ల పర్యవేక్షణలో ఒక బృందం జగన్‌ను అంతమొందించే ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు పనిచేస్తోందని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయి జైలుకెళ్లి బయటకు వచ్చినప్పటి నుంచి చంద్రబాబులో అసహనం పెరిగిపోతోందని, ప్రతి సందర్భంలో జగన్ సంగతి తేలుస్తానంటూ బెదిరిస్తున్నారన్నారు. పబ్లిక్ మీటింగ్‌లలో కూడా ముఖ్యమంత్రిపై ప్రతిపక్ష నేత ఈ విధమైన బెదిరింపు ధోరణితో మాట్లాడటం చూస్తే ఏదో కుట్ర జరుగుతోందన్న అనుమానం వ్యక్తమవుతోందన్నారు. పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందన్నారు. ప్రజల ఆదరణ, దేవుడి దయతో జగనన్న ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, పాయకరావుపేట జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యకర్తలతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



పాయకరావుపేటలో పార్టీ కార్యాలయం వద్ద కంబాల జోగులు నిరసన

ఎన్ని కుట్రలు చేసినా.. వైఎస్సార్‌సీపీదే అధికారం

అనకాపల్లి ఎంపీ అభ్యర్థి కార్యాలయం ప్రారంభోత్సవంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి



అనకాపల్లిలో ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్, బీవీ సత్యవతి

అనకాపల్లి, మునగపాక: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మరో మారు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద నగర్‌లో డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కార్యాలయాన్ని ఆదివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. మునగపాకలోని బొడ్డేడ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల స్థాయి సమావేశంలో కూడా సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు చోట్ల మాట్లాడుతూ బస్సు యాత్రలో సీఎంకు లభిస్తున్న ప్రజాదరణ చూసి టీడీపీ నేతలు కుతకుతలాడుతున్నారన్నారు. విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నంపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకుని నిందితులను శిక్షించాలన్నారు. సీఎంపై దాడి జరిగిన గంటలో సోషల్ మీడియాలో టీడీపీ నేతలు పోస్టులు పెట్టడం వారి వికృత క్రీడకు నిదర్శనమన్నారు. ప్రజల ఆశీస్సులున్నంత వరకు జగన్ మోహన్‌రెడ్డిని ఎవరూ ఏమీ చేయలేరని, ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా ఆయనకు ప్రజల హృదయాల్లో విశేష అదరణ ఉంటుందన్నారు. ఉత్తరాంధ్రలో బీసీ, దళితుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతుంటే టీడీపీ, జనసేన, బీజేపీ అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు. జనబలం ముందు ధనబలం ఎప్పటికీ నిలబడదన్నారు.

స్థానిక నేతలకే ప్రజల ఆశీర్వాదం

డిప్యూటీ సీఎం, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు స్థానికుడికి, స్థానికేతరుడికి మధ్య పోటీ అన్నారు. జిల్లా ప్రజలు ఎప్పుడు స్థానికులకే ఆశీర్వాదం అందిస్తారన్నారు. గతంలో ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన నూకారపు సూర్యప్రకాష్, అల్లు అరవింద్‌లకు పట్టిన గతే ఇప్పుడు కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌కు పడుతుందన్నారు. గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన రావడమే కాకుండా జగన్ పాలన బాగుందని చెపుతున్న సమయంలో ఎంతో ఆనందం కలిగిందన్నారు. దోపిడీకి మారుపేరైన సీఎం రమేష్ ప్రజల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలిస్తే విశాఖలో మాత్రమే ఉంటారని, ఇక్కడ ఆయన సోదరులు పాలన సాగిస్తారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లోను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచారని, ఈసారి కూడా క్లీన్‌స్వీప్ చేస్తారన్నారు. మునగపాక సమావేశంలో ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగిందన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో పార్టీ అనకాపల్లి పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ అనకాపల్లి మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, పార్టీ మునగపాక మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను పరిచయం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డి

న్యూస్‌రీల్


వేంపాడు చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఎస్పీ



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం తనిఖీ చేశారు. అక్కడ సిబ్బందితో మాట్లాడుతూ వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని, సారా, మద్యం, మత్తుపదార్థాలు అక్రమ రవాణా అరికట్టాలన్నారు. డబ్బు, ఉచిత కానుకల పంపిణీ అరికట్టేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణ తదితరులు

అనకాపల్లి : అగ్ని ప్రమాదాలపై ప్రతి వ్యక్తి అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్. వెంకటరమణ అన్నారు. స్థానిక ఉడ్‌పేట అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద వారోత్సవాల కరపత్రికను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అంతకు ముందు అగ్ని ప్రమాదంలో ఈ ఏడాది అసువులు బాసిన బీహార్‌కు చెందిన ఎస్.హెచ్.బేషుయాదవ్, కేరళకు చెందిన రాజేష్, అస్సాంకు చెందిన సతీష్ టోరాన్‌లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పరవాడలోని ఎంఎస్ఆర్ఎం కార్యాలయం వద్ద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు, ఉద్యోగులు, సీఎంఆర్ సంస్థ ప్రతినిధి కిశోర్ పాల్గొన్నారు.

సీఎంపై దాడి హేయమైన చర్య

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్




ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం హేయమైన చర్య అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంకు రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక పచ్చమూకలు దాడి చేశారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడినప్పటికీ సిద్ధం సభలకు వస్తున్న జనాలను చూసి చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు. విజయవాడలో సీఎం జగనన్న సభకు వేలాది మంది రోడ్లపైకి వచ్చి మద్దతు తెలియజేశారన్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే విధంగా కత్తితో దాడి చేయించారన్నారు. తాజా దాడిని హేళన చేస్తూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. పచ్చకామెర్ల వచ్చిన వాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందనడానికి అతని వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. దోపిడీలకు పెట్టింది పేరు అయ్యన్నపాత్రుడే అన్నారు. కోడికత్తితో పీక మీద కోసుకుంటే ఎలా ఉంటుందో తెలిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే హత్యాయత్నం

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు



కోటవురట్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేని పచ్చమూక ఏకంగా రాళ్లతో దాడికి పాల్పడడం హేయమైన చర్యని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. ఆదివారం కోటవురట్లలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం బస్సు యాత్రకు అడుగడుగునా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ఇది ఓర్వలేని టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా పచ్చ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. అతని ప్రసంగంలో రాళ్లతో సాగనంపండి అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టడం రాష్ట్ర ప్రజలంతా గుర్తించారన్నారు. మూడు పార్టీలు కలిసినా ఏం చేయలేకపోతున్నామనే ఉక్రోషంతో రగిలిపోతున్నాడని విమర్శించారు. ఈ ఎన్నికలే చంద్రబాబుకు ఆఖరివి అన్నారు. ధైర్యంగా ఎదుర్కోలేక నీచ రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. అతని బుద్ధిని ప్రజలంతా గమనిస్తున్నారని, ఫ్యాను గాలిలో కూటమి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగాల్లో రాళ్లతో కొట్టండి, గుడ్డలూడదీసి కొడతామంటూ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు.

చోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు

పోలీసుల పర్యవేక్షణలో భద్రపరిచిన అధికారులు



గాంధీ గ్రామం హైస్కూల్ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తున్న ఈవీఎంలు

చోడవరం: శాసనసభ సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం)ను ఆదివారం చోడవరం తీసుకొచ్చి భద్రపరిచారు. రెండు కంటెయినర్ వాహనాల్లో వీటిని తెచ్చారు. ఎంపీ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను శనివారం తెచ్చి ఇదే పాఠశాలలో భద్రపరిచారు. తాజాగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో చిన్నికృష్ణ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు మధ్య చోడవరంలోని గాంధీ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వీటిని తీసుకొచ్చారు. అధికారులు, అన్ని పార్టీల నాయకుల పర్యవేక్షణలో ఇక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌కు భారీ పోలీసు భద్రత ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికలకు సంబంధించి 243 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 243 ఓటింగ్ యంత్రాలను వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

ప్రజా గరళం

- చంద్రబాబు ప్రసంగంలో ఆత్మస్తుతి.. పరనింద
- బీసీ అభ్యర్థిని కించపరిచే వ్యాఖ్యలు
- తానేం చేస్తానో చెప్పకుండా తప్పించుకునే ధోరణి
- సభ ప్రారంభంలోనే వెనుతిరిగిన జనం
- పాయకరావుపేట, గాజువాకల్లో తుస్సుమన్న ప్రచార సభలు

సాక్షి, అనకాపల్లి/నక్కపల్లి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పాయకరావుపేటలో ప్రజాగళం పేరుతో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభ జనం లేక వెలవెలబోయింది. సభ రెండు గంటలపాటు ఆలస్యం కావడంతో ప్రసంగం ప్రారంభమైన వెంటనే ప్రజలు వెనుదిరిగారు. సభ చివర్లో బీజేపీ, టీడీపీ సింబల్స్ మాత్రమే చంద్రబాబు చూపించారు. గాజు గ్లాస్ చూపించకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లాలో మూడు చోట్ల జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నా.. వారిని గెలిపించమని చెప్పలేదని జనసేన క్యాడర్ ఆగ్రహానికి లోనయ్యారు.

బీసీలంటే అంత అలుసా?

చంద్రబాబు తన ప్రసంగంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిని కించపరిచే వ్యాఖ్యలు చేశారు. సీఎం రమేష్ ఢిల్లీలో 12 ఏళ్లుగా ఉంటున్నారని, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి ఢిల్లీ వెళ్లే రోడ్లు తెలుసుకోవడానికే నాలుగేళ్లు పడుతుందని వ్యాఖ్యానించారు.

- పవన్, మోదీలు తోడుంటే ఏమైనా సాధించవచ్చని, అందుకే వారితో జత కట్టానని చంద్రబాబు చెప్పిన మాటలు టీడీపీ కార్యకర్తలను కలవరపరిచాయి. వారి సహకారం లేకపోతే తాను ఏమీ సాధించలేనని చెప్పినట్టయిందని వారు ఆందోళన పడ్డారు.
- తన ప్రసంగంలో అధికారంలోకి వస్తే ఏం చేస్తానో చెప్పకుండా ఎంతసేపు జగన్ సర్కారును విమర్శించడం మొదలు పెట్టారు. దీంతో సభకు వచ్చిన జనం విసుగు పుట్టి ప్రసంగం ప్రారంభమైన పది నిమిషాలకే వెనుతిరిగారు.
- సైకిలెక్కండి.. పువ్వు చెవిలో పెట్టుకోండి.. గ్లాసు చేత్తో పట్టుకోండి అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నవ్వు తెప్పించాయి.

గాజువాకలో కూటమి మిత్రుల దుమ్మా

గాజువాక : టీడీపీ అధినేత చంద్రబాబు గాజువాకలో నిర్వహించిన ప్రజాగళం సభలో తన కూటమి పార్టీల నాయకుల జాడ కనిపించలేదు. గాజువాకలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. గత ఐదేళ్ల కాలంలో బలం కోల్పోయిన టీడీపీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కారణంతో బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర నాయకుల మధ్య సయోధ్య ఎలా ఉన్నా క్షేత్రస్థాయిలో వారి మధ్య సమన్వయం లేదన్న విషయాన్ని గాజువాక సభ మరోసారి స్పష్టం చేసింది. ఈ సభకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సహా జిల్లా కార్యవర్గంలోని సీనియర్ నాయకులు సైతం హాజరు కాలేదు. ఆ పార్టీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానికంగా ఉండే కొద్దిమంది కార్యకర్తలు హాజరయ్యారు. జనసేన పార్టీ నుంచి కూడా ముఖ్యనాయకులు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు ఒక్కరే వేదికపై కనిపించారు. సభ ప్రాంగణంలో కూడా ఒకరిద్దరు తప్ప మిగిలిన నాయకులెవ్వరూ కనిపించలేదు. పాతగాజువాకలోని 60 అడుగుల రోడ్‌లో ఏర్పాటు చేసిన చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జనం అంతంత మాత్రంగానే కనిపించారు.



గాజువాకలో వెలవెలబోయిన సభ

నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో మాస్టర్ అగస్త్య



నోబెల్ వరల్డ్ రికార్డ్స్ మెడల్, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న మాస్టర్ అగస్త్య బజాజ్

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): 16 నెలల వయసులోనే పుస్తకాలను గుర్తు పట్టి.. వాటిలో పదాలను పలకడం, వస్తువులను గుర్తించడంలో నగరానికి చెందిన అగస్త్య బజాజ్ నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మిందిలోని తన నివాసంలో ఆదివారం బాలుడితో పాటు అతని తల్లిదండ్రులు అగస్త్య రవి కుమార్ బజాజ్, సాక్షి బజాజ్‌లను అభినందించారు. అతి చిన్న వయసులోనే బాలుడి ప్రతిభ అద్భుతమని కొనియాడారు. బాలుడు తాతయ్య రాకేష్ కుమార్ బజాజ్, నాన్నమ్మ అల్పన బజాజ్, 72వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి సుందరపుపై వ్యతిరేకత

- మత్స్యకారులకు ఒక్క సీటూ ఇవ్వలేదని జనసేన పార్టీపై ఆగ్రహం
- పూడిమడకకు చెందిన సీనియర్ నేత రాజీనామా
- మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని టీడీపీ శ్రేణుల ఆవేదన

అచ్యుతాపురం: మూలిగే నక్కపై తాడిపండు పడ్డట్టు యలమంచిలి నియోజకవర్గంలో జనసేన పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. తాజాగా జనసేన పార్టీకి పూడిమడక మాజీ ఉప సర్పంచ్, జిల్లా మత్స్యకార నాయకుడు చోడపల్లి అప్పారావు ఆదివారం రాజీనామా చేశారు. మత్స్యకారుల పట్ల వివక్ష చూపిస్తున్నారని, ఉత్తరాంధ్రలో 8 శాతం ఉన్న తమ వర్గానికి ఒక్క సీటూ జనసేన కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రాజీనామా చేయడం ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రధాన వర్గాల్లో ఒక్కటైన మత్స్యకారులు సుందరపుపై ఆగ్రహావేశాలతో ఉన్నారు. కొద్ది నెలల క్రితం పూడిమడకకు చెందిన మత్స్యకారునిపై దాడి చేస్తున్న దృశ్యాలను ఇప్పటికీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండటంతో ఆ వర్గం వారు గుర్రుగా ఉన్నారు. దీంతో మత్స్యకార గ్రామాలైన పూడిమడక, తంతడి వంటి కీలక గ్రామాల్లో కూటమి అభ్యర్థి పట్ల ఏ మాత్రం సానుకూలత లేకుండా పోయింది. అయితే ఈ దఫా ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని ఆశలు పెట్టుకున్న కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ దురుసుతనంపై ఇప్పటికే నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. ఒక వైపు ఓటర్లను సున్నితంగా ఆకర్షించకపోగా, సదరు నేత తీరుపై మరోవైపు ఇటు కూటమి పార్టీలు సహకరించకపోగా, ఆ పార్టీల్లో కీలక వర్గాలు దూరమవుతున్నాయి.

కలవని మనసులు...

మరోవైపు కూటమి అభ్యర్థితో టీడీపీ నాయకులకు ఏ మాత్రమూ పొసగడం లేదు. కూటమి అభ్యర్థి అయినప్పటికీ తమను కలుపుకుని పోవడం లేదని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. బయటకు నియోజకవర్గ నేతలు కలిసి తిరుగుతున్నప్పటికీ గ్రామ స్థాయిలో ఆ క్యాడర్ కలవలేదు. బీజేపీ ప్రభావం అంతంత మాత్రమే ఉన్న ఈ నియోజకవర్గంలో టీడీపీ కాస్త కీలకమైన పార్టీయే. అయినప్పటికీ కూటమి అభ్యర్థి తీరుతో విసిగిపోయిన పలువురు తెలుగు తమ్ముళ్లు ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తామని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. బీజేపీకి క్యాడర్ లేకపోవడం, టీడీపీ అభ్యర్థికి సీటు రాకపోవడం వంటి పరిణామాలతో కూటమి అభ్యర్థి నిరాశలోకి వెళ్లిపోయారనే చెప్పాలి.

క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థినికి అభినందన


రజని

రాంబిల్లి: కేజీబీవీ ఇంటర్ ఎంఎల్‌టీ కోర్సులో 582 మార్కులు సాధించిన సీహెచ్ రజనిని ఎంఈవో ఎం.సూర్యారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రమీల అభినందించారు. కేజీబీవీలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సులో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకు గాను రజని 582 మార్కులు సాధించడం అభినందనీయమని ఎంఈవో సూర్యారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రమీల పేర్కొన్నారు.

టేకుతోటలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక, అటవీ అధికారులు

మాడుగుల రూరల్: అవురువాడ పంచాయతీ శివారు తిరువాడ గ్రామ సమీపంలో గల సామాలకొండ, నాగాలుకొండ సమీపంలో గల టేకుతోటలో ఆదివారం ఆకతాయిలు నిప్పు అంటించారు. దీంతో టేకు తోటలో గడ్డి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, వీఆర్‌ఓ భరద్వాజ, పంచాయతీ కార్యదర్శి సింహచలం, అటవీశాఖ సిబ్బంది శేఖర్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పి వేశారు.

బొర్రా వెలవెల



అనంతగిరి: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఆదివారం వెలవెలబోయాయి. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో సందర్శిత ప్రాంతాలు కళ తప్పాయి. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు తిలకించేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. ఈ ఆదివారం గుహలను కేవలం 1500 మంది సందర్శించగా, రూ.1.29 లక్షల ఆదాయం వచ్చింది. జిప్‌లైన్‌పై 106 మంది విహరించగా రూ.53 వేల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.

పాడి రైతుల అభ్యున్నతికి రాఘవరావు పరిశోధనలు దోహదం

- డా.యెలినేని రాఘవరావుకు ఘన సన్మానం
- 'జీవన తరంగిణి' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు


డా.యెలినేనిని ఘనంగా సత్కరిస్తున్న అతిథులు

పాయకరావుపేట : పశు పోషకులను సమాజంలో గౌరవ స్థానంలో నిలబెట్టడానికి డా.రాఘవరావు చేసిన కృషి అమోఘమైనదని రాష్ట్ర విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా.మన్మోహన్ సింగ్ అన్నారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీ ప్రకాష్ విద్యాసౌధంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో పశు పోషక శాస్త్ర విజ్ఞానఖని డా.యెలినేని రాఘవరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీవన తరంగిణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ పట్టు వదలని విక్రమార్కుడిలా రాఘవరావు చేసిన ప్రయోగాలు, యంత్రాల ఆవిష్కరణలు పశు పోషకుల అభ్యున్నతికి ఎంతో సహాయపడ్డాయని పేర్కొన్నారు. గౌరవ అతిథి ఇక్రిశాట్ సీనియర్ సైంటిస్ట్ (రిటైర్డ్) డా.సి.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ పశుపోషణ లాభదాయకంగా చేపట్టడంలో డా.రాఘవరావు ఇచ్చిన సలహాలు, సూచనలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. మరో గౌరవ అతిథి స్టైల్ ప్రాజెక్ట్, పశు సంవర్ధక శాఖ, అడిషనల్ డైరెక్టర్ డా.వై.సింహాచలం మాట్లాడుతూ డా.రాఘవరావు చేసిన ప్రయోగాలు, వృత్తిపరమైన విజయాలు అందరికీ ఆదర్శప్రాయమైనన్నారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.వి.కె. నరసింహారావు మాట్లాడుతూ డా.రాఘవరావు పరిశోధనా ఫలాల వల్ల ప్రయోజనం పొందిన ఎంతో మంది పాడిరైతుల తరపున ఆయనకు కృతజ్ఞతగా ఆయన జీవన గమనంపై ఒక పుస్తకం రూపకల్పన చేయాలనే ఆలోచనకు ప్రతిరూపమే ఈ 'జీవనతరంగిణి' అని అన్నారు. సన్మాన గ్రహీత డా.యేలినేని రాఘవరావు మాట్లాడుతూ తన జీవన గమనంలో టీచర్‌గా, పశు వైద్యుడిగా, శాస్త్రవేత్తగా, పరిశోధకుడిగా, పశుపోషకుల అభివృద్ధి, పశుగణక్షేత్రాల అభివృద్ధి కోసం కృషి చేయడం తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని, తన జీవితకాలం అంతా మూగజీవాలకు సేవ చేసుకునే అదృష్టం కలిగినందుకు తాను గర్విస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు సీజీఎం (రిటైర్డ్) పి.మోహనయ్య, డా.కె.నరేంద్రబాబు, పంకజ్‌బదానా, డా.వి.రవీంద్రబాబు, చంద్రశేఖర్, ప్రసన్న కుమార్, డా.సింహాచలం, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్లు, మెంబర్లు, పరిసర గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటుపడాలి


ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న నాగులాపల్లి యువకులు

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే విజయానికి నాంది పలుకుతాయన్నారు. రాష్ట్ర బీసీసెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు ఆధ్వర్యంలో నాగులాపల్లికి చెందిన పలువురు ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. రామగిరి, మెలిపాకల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పార్టీ కండువాలు తొడిగి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా పోటీ చేస్తున్న బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, నాగులాపల్లికి చెందిన పార్టీ నేతలు మల్ల ఉమామహేశ్వరరావు, ముచ్చకర్ల సత్యనారాయణ, బొడ్డేడ బుజ్జి, మళ్ల కాశీ సురేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రామగిరి వాసులు

పాడేరులో అమానవీయ ఘటన

- శిశువు కళేబరాన్ని పీక్కుతిన్న కుక్కలు
- సగం కళేబరం ఆస్పత్రి మార్చురీకి తరలింపు

పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో ఆదివారం అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఏ తల్లి కన్న బిడ్డో కానీ వారం రోజుల వయస్సున్న ఆడ శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన స్థానికుల కంట తడిపెట్టించింది. పాడేరు ఎంపీడీవో కార్యాలయానికి సమీపంలో రోడ్డు పక్కన ఆదివారం శిశువు కళేబారాన్ని కుక్కలు పీక్కు తినడం స్థానికులు చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే కుక్కలు నడుము నుంచి కింద భాగం వరకు పూర్తిగా తినేశాయి. మిగిలిన కళేబరాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. శిశువును ప్రసవించిన మహిళ కావాలనే బిడ్డను వదిలేసిందా లేకా మరేమైనా జరిగిందా అన్న వివరాలు తెలియరాలేదు. శిశువు కళేబరం బొడ్డు భాగంలో ఆస్పత్రి స్టిక్కర్ ఉండడంతో ఆ దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. అంబేడ్కర్ గురించి చెప్పాలంటే ఒక రోజు కూడా చాలదన్నారు. ఆ మహనీయుని ఆశయాలు, ఆదర్శాలు మన జీవనశైలిలో పాటించాలన్నారు. మన గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజల దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తే, వెంటనే పరిష్కరిస్తామన్నారు. భారతదేశం ఉన్నంతకాలం అంబేడ్కర్ పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ టి.అజయ్‌బాబు, సోషల్ వెల్ఫేర్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్ : ఎస్పీ

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వివక్ష, పేదరికం ఎదుర్కొంటూ లక్ష్య సాధనలో వెనుకంజ వేయకుండా ఉన్నత చదువులు చదివి దేశానికి రాజ్యాంగ రూపకల్పన చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అన్ని వర్గాలకు సమానత్వం, సమాన వేతనాలు ఉండాలని, అందరికీ రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించారన్నారు. మహిళలకు ఎక్కడ సముచిత స్థానం ఉంటే అక్కడ అభివృద్ధి ఉంటుందన్నారు. వీరితోపాటు బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్లు జి.శంకర్‌రావు, ధనుంజయరావు, సిహెచ్ సంజీవరావు, రూరల్ ఎస్‌ఐ జి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇసుక ట్రాక్టరుపై కేసు నమోదు


స్టేషన్‌లో ఉన్న ఇసుకతో పట్టుబడిన ట్రాక్టరు

నాతవరం : తాండవ నదిలో అక్రమంగా తవ్వకాలు జరిపి ఇసుక తరలిస్తున్న టీడీపీ నేత జిల్లేడుపూడి సర్పంచ్ లాలం రమణ ట్రాక్టరును పోలీసులు పట్టుకున్నారు. గుమ్మడిగొండ సమీపంలో తాండవ నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాడు. దీనిపై గొలుగొండ ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం వెళ్లడంతో ఎస్‌ఈబీ ఎస్‌ఐ రహీం నదిలో ట్రాక్టరుపై ఇసుక లోడు చేస్తుండగా పట్టుకుని నాతవరం పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. నాతవరం ఎస్‌ఐ రామారావు ఆదివారం కేసు నమోదు చేసినట్టుగా తెలిపారు. కొత్తగా వచ్చిన నిబంధనల ప్రకారం అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి రవాణా చేస్తున్న ట్రాక్టరుకు మొదటసారి పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు. మళ్లీ పట్టుబడితే ట్రాక్టరు డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. పట్టుబడిన ట్రాక్టరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



అంబేడ్కర్‌కు నివాళి

అనకాపల్లి భీమునిగుమ్మంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్, బీవీ సత్యవతి - అనకాపల్లి

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్లు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు


అమ్మవారికి మొక్కు తున్న భక్తురాలు

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గడ్డి మందు తాగి దివ్యాంగుడి మృతి


మృతి చెందిన రమణ

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన బండారు రమణ(66) గడ్డి మందు తాగి ఆదివారం మృతిచెందాడు. దివ్యాంగుడైన తాను కుటుంబానికి భారంగా మారినట్టు మనస్థాపానికి గురైన రమణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందును తాగాడు. ఇంటికి వచ్చిన భార్య లక్ష్మి అపస్మారక స్థితిలో ఉన్న భర్త రమణను గుర్తించి స్థానికుల సాయంతో కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకువెళ్లింది. అయితే అప్పటికే రమణ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. రమణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి


అయితంశెట్టి రాము (ఫైల్)

అచ్యుతాపురం : తిమ్మరాజుపేటకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అయితంశెట్టి రాము విద్యుత్ ప్రమాదానికి గురై ఆదివారం మృతి చెందారు. కొండకర్లలో ఒక ప్రైవేట్ రిసార్టులో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్ తగిలి భవనం పై నుంచి కిందకు పడిపోయి మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి

డ్రైవర్‌కు గాయాలు


కారులో గాయపడి మృతి చెందిన సురేష్

కె.కోటపాడు : సూదివలస జంక్షన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న బోకం సురేష్(33) సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు సురేష్ భార్య ఆమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్.ఐ లక్ష్మీనారాయణ కేసును నమోదు చేశారు. ప్రమాదంపై ఎస్.ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన మృతుడు బోకం సురేష్, లోకిరెడ్డి అప్పలరాజు కారులో కె.కోటపాడు వైపు బంధువుల ఇంటికి బయలుదేరారు. కారు సూదివలస కూడలి వద్దకు చేరుకునే సరికి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో పక్కన కూర్చున్న సురేష్ తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారు డ్రైవింగ్ చేస్తున్న అప్పలరాజుకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సురేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


పిల్లల నృత్య ప్రదర్శనలు


ఆకట్టుకున్న బుర్రకథ

మునగపాక : మునగపాక బీసీ కాలనీలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పిల్లలతో కోలాటం ప్రదర్శనలు, డ్యాన్స్ హంగామా వంటి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విజయనగరం కళాకారులతో ప్రదర్శించిన బుర్రకథ అలరించింది.

పలు నేలవేషాలతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన రంగులరాట్నం ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీచ్‌బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.

ఐదేళ్లలో మలేరియా మరణాలు సున్నా

ప్రతి ఏడాది గిరిజనాన్ని పొట్టన పెట్టుకునే మలేరియా మహమ్మారిని ప్రభుత్వం అదుపుచేసింది. గతంలో ఈ వ్యాధి ఎప్పుడు విజృంభిస్తుందో...ఎంతమందిని పొట్టన పెట్టుకుంటుందో తెలియని పరిస్థితిల్లో గిరిజనం బితుబితుకుమంటూ కాలం గడిపేవారు. ఐదేళ్ల ముందు వరకు పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో ప్రతి ఏడాదీ కనీసం 50 మందికి మలేరియాతో మృతిచెందేవారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు ఫలితమిచ్చాయి. జ్వరపీడితులకు తక్షణం వైద్యసేవలు, విస్తృతంగా పారిశుధ్య చర్యలతో ఈ ఐదేళ్లలో ఒక్క మలేరియా మరణం కూడా నమోదు కాలేదు.

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- ఏటా దోమల నివారణ మందు పిచికారీ
- పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- విస్తృతంగా వైద్యఆరోగ్య కార్యక్రమాలు

సాక్షి,పాడేరు: గతంలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ, పారిశుధ్య కార్యక్రమాలు అంతంత మాత్రంగానే ఉండేవి. గిరిజనుల ప్రాణాలంటే గతంలో పాలకులకు లెక్క ఉండేది కాదు. 2012 నుంచి 2018 వరకు జిల్లాలో మలేరియా తీవ్రత అధికంగా ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశారు. గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి 50 కుటుంబాలకు గ్రామ వలంటీర్ల సేవలను అందుబాటులోకి తెచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పలు చర్యలు చేపట్టింది. మరోవైపు దోమల నివారణకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖ బృందాలు నిరంతరం పనిచేశాయి. 2022లో ఏజెన్సీ వ్యాప్తంగా 7,20,950 దోమ తెరలను ప్రభుత్వం పంపిణీ చేయడం మరింత మేలు చేసింది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు ఎపిడమిక్ సీజన్‌గా ప్రభుత్వం గుర్తించి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను చేపడుతోంది. 2019 నుంచి నుంచి దోమల నివారణతో పాటు మలేరియా తీవ్రతను అరికట్టడంలో మలేరియా, వైద్య ఆరోగ్యశాఖలు ఎంతో శ్రమించాయి. ప్రతి గిరిజనుడి ఇంటి లోపల, బయట దోమల మందు పిచికారిని తప్పనిసరిగా చేయించుకోవాలనే నిబంధనను సచివాలయ ఉద్యోగులు అమలు చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే కూడా విజయవంతంగా జరిగింది. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్య సిబ్బంది వెంటనే రక్త పరీక్షలు జరిపేవారు. మలేరియా, ఇతర జ్వరాలను నిర్ధారించి వైద్య సేవలు అందించడంతో జ్వరపీడితులు కోలుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించడంతో మలేరియా వ్యాధితో ఎవరూ మృతి చెందలేదు.

నేటి నుంచి దోమల మందు పిచికారి

ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించింది. జిల్లాలో 1,774 మలేరియా పీడిత గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. ఈ గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి మొదట విడత దోమల నివారణ మందు పిచికారీని జిల్లా మలేరియాశాఖ ప్రారంభించనుంది. ఈఏడాది కూడా నూరుశాతం పిచికారీ పనులు విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లలో నిమగ్నమైంది.


రక్తపూతలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

సంవత్సరం	రక్తపూతలు	మలేరియా సేకరణ	మరణాలు కేసులు
2019	7,90,941	1,121	0
2020	6,12,917	1,280	0
2021	7,31,759	841	0
2022	7,09,124	830	0
2023	8,08,938	3,304	0
2024(మార్చి వరకు)	1,65,751	407	0

క్లుప్తంగా

ఆకట్టుకున్న 'హాస్యంతో అల్లరి'



కార్యక్రమంలో హాస్యం పండిస్తున్న కళాకారులు

అనకాపల్లి : మెయిన్‌రోడ్డు వైఎంవీఏ శ్రీధరాల వెంకటరమణ హాల్లో ఆదివారం రాత్రి హాస్యంతో అల్లరి కార్యక్రమం నిర్వహించారు. లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అంతకు ముందు ఈల పాటతో విజయ్‌బాబు ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ నేతలు దాడి వాసు, బొడ్డేడ మురళి, వినకోట బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సోమ, మంగళవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. రుతు పవనాలకు ముందుగా అంతరాయాలు లేకుండా విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలు తొలగించడానికి ఉదయం 6.30 నుంచి ఉదయం 10.30 గంటల వరకు తాళ్లపాలెం, కన్నూరుపాలెం రూరల్ ఫీడర్లు, వ్యవసాయ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాబూరావు మృతికి సంతాపం

అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి దేవాలయం సమీపంలో దేవాలయ వ్యవస్థాపకుడు కొణతాల బాబూరావు మృతికి ఆదివారం కమిటీ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరారవు మాట్లాడుతూ దేవాలయ ఏర్పాటుకు బాబూరావు చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. అరసవల్లి దేవాలయం తర్వాత ఇక్కడ దేవాలయానికి ఎంతో మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణప్రసాద్, సభ్యులు నర్సింగరావు, వెంకటరమణ, నూకరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాముడి పెళ్లిరాట మహోత్సవం

మాకవరపాలెం: శ్రీరామనవమిని పురస్కరించుకుని రాముడి పెళ్లిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్థానిక రామాలయం వద్ద రాముడి పెళ్లిరాట మహోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామనవమిని ప్రతి గ్రామంలోనూ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదేరోజు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు.

అనకాపల్లి సినిమాలు

లవ్‌గురు	: రాజా
శ్రీరంగ నీతులు	: సత్యనారాయణస్క్రీన్-1
ఐమాక్స్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డిసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మెల్ బాయ్స్	: వెంకటేశ్వర
మెర్సీ కిల్లింగ్	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, ఏ నెగిటివ్-2, బీ పాజిటివ్-13, బీ నెగిటివ్-2, ఓ పాజిటివ్-14, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 223 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ను సంప్రదించవచ్చు.

పల్లెల్లో ప్రగతి వీచికలు



మంచినీటి ఇక్కట్లు తీరాయి..

కశింకోట మండలం పేరంటాలపాలెం గ్రామంలో అట్టుముక్కల వెంకట వరలక్ష్మి మూడు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. ఈమె గృహిణి. గతంలో మంచినీటి కోసం ఇబ్బంది పడేవారు. పక్కన పరిశ్రమ వల్ల భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి ఇబ్బంది పడేవారు. వీధి కుళాయిల నీరు సరిపోయేది కాదు. ఇప్పుడు ఇంటింటి కుళాయిలు వేసి సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నారు. దీంతో ఎంతో ఆనందంగా ఉందని వెంకట వరలక్ష్మి ఆనందం తెలిపారు.

- రూ. లక్షలాది రూపాయలతో పేరంటాలపాలెం అభివృద్ధి
- సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం
- ఇంటింటి కుళాయిల ఏర్పాటుతో తాగునీటి ఏర్పాటు

చేసిన అభివృద్ధి.. ఖర్చు చేసిన నిధుల వివరాలు

- రూ.30 లక్షలతో పేరంటాలపాలెం పంచాయతీలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం
- రూ.21.80 లక్షలతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటు
- రూ.18 లక్షలతో నాడు-నేడులో జోగారావుపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధి



కశింకోట : జగనన్న ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలు సైతం ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయి. మండలంలోని మారుమూలన ఉన్న పేరంటాలపాలెం పంచాయతీ ప్రగతి వైపు పయనిస్తోంది. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందింది. సుమారు రూ.70 లక్షలు ఇక్కడ అభివృద్ధి కోసం కేటాయించారు. సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మారుమూల కొండ ప్రాంతంలో పేరంటాలపాలెం పంచాయతీ ఉంది. ఇక్కడున్న చిన్న పంచాయతీల్లో ఇదొకటి. జోగారావుపేట గ్రామానికి శివారున ఉంది. ఇక్కడి జనాభా సుమారు 1500. తేగాడ సచివాలయం పరిధిలోకి ఈ ప్రాంతం వస్తుంది. పేరంటాలపాలెం, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీతో పాటు శివారు జోగారావుపేట గ్రామంలో రూ.30 లక్షలు ఖర్చు చేసి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. గతంలో ఏ మాత్రం వర్షం వచ్చినా రోడ్లపై రాకపోకలు సాగించడానికి ప్రజలు నానా ఇబ్బంది పడేవారు. మురుగు నీరు రోడ్లపైనే ప్రవహించేది. ఇప్పుడు రోడ్లు, కాలువలు నిర్మించడంతో ప్రజల ఇబ్బందులు తొలిగాయి. అలాగే రెండు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ కింద రూ.23 లక్షలు వెచ్చించి ఇంటింటి కుళాయిలు అందించారు. గతంలో ఇక్కడ సరిగ్గా మంచి నీరు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. బోరు నీరు తాగుదామంటే పరిశ్రమల వ్యర్థాల వల్ల నీరు కలుషితమై అనారోగ్యం బారిన పడాల్సి వచ్చేది. వీధి కుళాయిలు పూర్తి అవసరాలు తీర్చేవి కాదు. ఈ పరిస్థితిలో అసంపూర్తిగా ఉన్న నీటి ట్యాంకును ప్రారంభించారు. కశింకోటలోని భారీ రక్షిత మంచినీటి పథకం నుంచి పైపులైన్ వేశారు. ఇంటింటి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. రెండు గ్రామాల్లో సుమారు 700 ఇంటింటి కుళాయిలు అందజేయడంతో తాగునీటి ఇబ్బంది తొలిగిందని స్థానికులు ఆనందిస్తున్నారు. ఇక జోగారావుపేటలో నాడు–నేడులో రూ.18 లక్షలు ఖర్చు చేసి ప్రాథమిక పాఠశాలను అందంగా అభివృద్ధి చేశారు. ఇక్కడి నుంచి మునగపాక మండలం గణపర్తికి రెండు కిలోమీటర్ల పొడవున రోడ్డు వెడల్పు చేసి విస్తరించారు. ఇది రైతులు, ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా మారింది. అయితే తారు రోడ్డు ప్రతిపాదన కార్యాచరణ దాల్చాల్సి ఉంది. ఇలా మారు మూలనున్న చిన్న గ్రామాలు కూడా లక్షలాది రూపాయలతో అభివృద్ధి చెందడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటింటి కుళాయి నుంచి నీరు పట్టుకుంటున్న యువతి



రహదారి లేక ఇబ్బంది పడేవాళ్లం..

పేరంటాలపాలేనికి చెందిన అల్లం శ్రీను ప్రైవేటు పరిశ్రమ ఉద్యోగి. కుటుంబంతో రెండు దశాబ్దాలకు పైగా జీవనం సాగిస్తున్నారు. చాలా కాలం గ్రామంలో సరైన రోడ్లు లేవు. దీంతో ఏ మాత్రం వర్షం పడినా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు కొత్తగా సిమెంట్ రోడ్లు వేశారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలిగాయి. దశాబ్దాల నాటి సమస్య తీరడంతో ఎంతో ఆనందంగా ఉందని శ్రీను పేర్కొన్నారు.



సిమెంట్ కాలువల నిర్మాణం



పేరంటాలపాలెంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- రాజ్యాంగ నిర్మాతకు వాడవాడలా ఘన నివాళి



నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు, భరత్‌కుమార్



గవరపాలెం అరుంధతి నగర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మలసాల భరత్



రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలు పట్టణ, మండలంలో వాడవాడలా ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక రింగురోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని ఆయన కొనియాడారు.

భీమునిగుమ్మంలో...

స్థానిక భీమునిగుమ్మం రైల్వేస్టేషన్ రహదారిలో జైభీమ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఉపముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బీవీ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి బూడి ముత్యాలనాయుడు పూలమాలలువేసి నివాళులర్పించారు. గవరపాలెం అరుందతి నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మండలంలో పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీ, కుంచంగి, తుమ్మపాల, బట్లపూడి, గొలగాం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి మలసాల భరత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శంకరం గ్రామంలో..

జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో శంకరం గ్రామంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యుడు రేబాక మధుబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతానగరం గ్రామంలో..

మండలంలోని సీతానగరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోలపర్తి శ్రీనువాసరావు, ఆ పార్టీ సీనియర్ నేత గంగుపాం నాగేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అలమట శ్రీను, పీలా బుజ్జీ, అంబేడ్కర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

స్థానిక కోర్టు ఆవరణలో అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి సీనియర్ న్యాయవాది కనిశెట్టి సురేష్‌బాబు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ కార్యాలయం వద్ద..

గవరపాలెం కార్మికశాఖ కార్యాలయం వద్ద జిల్లా పరిషత్ ప్రొడక్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసఫ్, హిమశేఖర్ విద్యా సంస్థల అధినేత కొణతాల జనార్దన్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమునిగుమ్మం అంబేడ్కర్ విగ్రహం వద్ద విశ్వహిందూ పరిషత్, సామాజిక సమ్రత అభియాన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు చేశారు.

కశింకోట: వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తన స్వగ్రామం ఏఎస్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలపాలెంలో కూడా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, శ్రేణులు, స్థానిక నాయకులు, దళిత ప్రతినిధులు పాల్గొన్నారు. ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ లక్కరాజు గోవింద, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: సంతబయట, కశింకోటలో పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకులు, రిటైర్డు ఎంఈవో నంబా రమణ, ఊడి నరసింగరావు, జగ్గారావు, దొమ్మెసి సత్యారావు, మంత్రి కామేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక హౌసింగ్ కాలనీలోని గుర్రం జాషువా యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వివేకానంద స్కూలు కరస్పాండెంట్ మళ్ల జగదీష్, నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కట్టుమూరి మంగరాజు, చెవ్వేటి నాగరాజు తదితరులు అంజలి ఘటించారు. కశింకోట పంచాయతీలో కార్యదర్శి కె.రమేష్, సర్పంచ్ మంత్రి జయరజని ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

తుమ్మపాల: మండలంలో రేబాక, శంకరం గ్రామాల్లో స్థానిక యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు, అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ తాతబాబు, అంబేడ్కర్ సంఘం నాయకులు గూనురు రామఅప్పారావు, కిరణ్, మహిళలు పాల్గొన్నారు.



సీతానగరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కోలపర్తి శ్రీను



ఏఎస్ పేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్



చింతలపాలెంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



శంకరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు, అప్పలరాజు



ఉగ్గినపాలెంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోట పోలీస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళితులు, ప్రజా సంఘాల ప్రతినిధులు



కశింకోట హౌసింగ్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు



తాళ్లపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకుకూరలతో కంటి సమస్యలకు చెక్



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు మౌనిక

అనకాపల్లి : కంటి చూపు మందగించకుండా వారానికి రెండు సార్లు ఆకుకూరలు తీసుకోవాలని విశాఖలోని పెదవాల్తేర్ కంటి ఆస్పత్రి వైద్యురాలు జి.మౌనిక తెలిపారు. గొల్లవీధి చౌడేశ్వరీ పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి శిబిరంలో ఆమె పాల్గొన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారు వెంటనే వైద్యుడికి చూపించుకోవాలన్నారు. శిబిరంలో దాదాపు 220 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చినట్లు తెలిపారు. సంఘం కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ బళ్లా నాగభూషణం, గౌరవ అధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్షులకు తాగునీరు, వరి కంకుల ఏర్పాటు



శాంతి పార్కులో పక్షులకు తాగునీరు, వరి కంకులు ఏర్పాటు చేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి : వేసవిలో పక్షులను రక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందని గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి, గాంధీనగరం, గవరపాలెం, రింగురోడ్డు పార్కుల్లో చెట్టుకొమ్మలకు వరి కంకులు, తాగునీటి కుండీలు ఆదివారం ఏర్పాటు చేశారు. పక్షుల కోసం ప్రతి ఏడాది ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. షుగర్ వైద్యుడు కొడుకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్చిలో పట్టణ పరిధిలో ఉన్న దేవాలయాలన్నింటిలో ఇటువంటి కార్యక్రమం చేశామన్నారు. పట్టణ పరిధిలో గృహాల వద్ద పక్షులకు కాసింత తిండి గింజలు, తాగునీరు ఏర్పాటు చేయాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్యనారాయణ, మహేష్, పూర్ణ చంద్రరావు, రాపేటి నాగేశ్వరరావు, శివ, రామకృష్ణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి మరోసారి పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పిలుపు
- పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపైన ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్ కాలనీలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, మహిళా విభాగ పట్టణ అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, పార్టీ నేతలు మోనూరి శ్రీనివాసరావు, కొండలరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

80వ వార్డులో..

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ సీనియర్ నేత మలసాల కుమార్‌రాజా ప్రచారం చేశారు. 80వ వార్డు 19వ సచివాలయం పరిధిలో గడపగడపకూ మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పెంటకోట శ్రీను, కర్రి రమేష్, సత్యనారాయణ, మరిశెట్టి శ్రీను, రవి పాల్గొన్నారు.

గోపాలపురం పంచాయతీ పరిధిలో..

మండలంలోని గోపాలపురం పంచాయతీ వెంకటరమణ పేటలో ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు గడప గడపకు వెళ్లి రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, సభ్యులు బంటు శివనాయుడు, రమణ, శంకరరావు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

83వ వార్డు వేల్పులవీధిలో..

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కు మద్దతుగా వేల్పులవీధిలో ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామమూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు–1 ఉగ్గిన అప్పారావు ప్రచారం చేశారు. పార్టీ నేతలు వేల్పుల గణేష్, లట్టాల మురళీకృష్ణ, గొర్లి చిన్న పాల్గొన్నారు.



80వ వార్డులో గడప గడపకు ప్రచారంలో పాల్గొన్న కొణతాల భాస్కర్



శ్రీరామ్‌నగర్ కాలనీలో మలసాల భరత్‌కుమార్‌కు హారతి ఇస్తున్న మహిళ



వేల్పులవీధిలో గడప గడపకు ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ రామ్మూర్తి



దివ్యాంగుడిని ఓటు అడుగుతున్న మలసాల భరత్‌కుమార్



ఎన్నికల కరపత్రాన్ని అందజేస్తున్న మలసాల భరత్



వెంకటరమణ పేటలో గడప గడపకు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న గొర్లి సూరిబాబు



వృద్ధురాలితో మాట్లాతున్న మలసాల భరత్‌కుమార్